# చిరంజీవి

మంచంలో పడుకొని యింటికప్పు వంక చూస్తున్న చిరంజీవి ఒక్కసారి పెద్దగా మూలిగాడు.

చిరంజీవి మంచం పక్కనే బల్లమీద - మందుసీసా, గాజుగ్లాసు ఒకటి, రెండు బత్తాయిపళ్ళు, ఆచార్లుగా రిచ్చిపోయిన సీతాంశురసంకణికె వున్నాయి.

చిరంజీవి బాధతో మళ్ళీ మూలిగాడు. వాళ్ళమ్మ వచ్చి గ్లాసులోకషాయం పోసి, అందులో నాలుగుచుట్లు సీతాంశురసం కణికె అరగదీసిపోసి, అంతా కలిపి "ఇంద, నాబుజ్జినాన్నా! ఈ మందు తాగితివా నీ జ్వరం పారిపోతుంది. జ్వరం పోగానే అన్నం పెట్టమన్నాడుగా ఆచార్లుగారు" అని ఆమె చిరంజీవి జుట్టు నిమిరింది.

"చేదు మందులు" అని విసుక్కొన్నాడు మంచంలో కదలలేని కుర్రవాడు.

"నా బుజ్జి తండ్రివిగాదూ, చేదుమందుకేగా జ్వరాలు లొంగేది; ఇంకొక్క గుక్క వేస్తివా...యిదుగో, బత్తాయికాయ వలిచి పెడతానుగా. చ్చుచ్చుచ్చూ—"

చిరంజీవి రెండు నెలలు మందులు తాగాడు. ఒకరోజున ఆచార్లుగారు నవ్వి- "యిఖ పథ్యం కొంచెం నాలికకు నాకించు తల్లీ" అని వాళ్ళమ్మతో అన్నాడు. ఈ మాట చిరంజీవి మూలగలేదు. ఇంటికప్పువంక చూడలేదు.

ఆ సంవత్సరానికి చిరంజీవి చదువు చెడిపోయింది. మొదట వాళ్ళ నాన్న చచ్చిపోయినాడు. వాళ్ళమ్మ ఏడుస్తుంటే చూచి దిగులుపడ్డాడు. ఆ తర్వాత జ్వరం వచ్చింది. ఇప్పుడు చదువుకూడా పోయింది.

చిరంజీవి మంచంలో వుండగా, మొదట్లో అయితే అతని స్నేహితులు వచ్చి చూసివెళ్ళారు. పదిపదిహేను రోజులు పోయింతర్వాత, అసలు రావటమే మానేశారు. జ్వరం మంచంలో పడుకొని, పేరంటాలు గారి బయల్లో ఆటలాడుతున్న శ్రీహరి, సత్యం వాళ్ళ గొంతుల్ని చిరంజీవి చక్కగా గుర్తుపట్టేవాడు. కాని శ్రీహరిగాని, సత్యంగాని, వాళ్ళ చెల్లెలు కాముడుగాని తన దగ్గరకువచ్చి వెనకటి మాదిరిగా నవ్వించనే లేదు. ఈ రోగిష్టివాడి సంగతి వాళ్ళకు పట్టలేదు.

పథ్యం పెట్టిన రోజున-"నాకు ఆవకాయ కావాలి." అన్నాడు చిరంజీవి.

"హోరి పిచ్చిసన్నాసీ! యింకేమన్నా వుందీ. ఆవకాయి మంచివాళ్ళకే పడదు. ఇప్పుడు తింటే కాళ్ళూచేతులు పట్టుకు పోతయ్యి." అని అమ్మ అన్నది.

పథ్యం మెతుకులు తిన్న తర్వాత, జోలబాడినట్టుగా నిద్ర వచ్చింది చిరంజీవికి. వాళ్ళమ్మ నిద్రపోవద్దన్నది. నిద్రబోతే అన్నరసం తలకెక్కి జ్వరం తిరగబెడుతుందని ఆచార్లుగారు చెప్పారన్నది.

"అయితే నాకు పుస్తకం యియ్యి. చదువుకుంటా."

వాళ్ళమ్మ ఓ కథల పుస్తకం యిచ్చింది. చిరంజీవి సాయంత్రందాకా చదువుతూనే వున్నాడు. పథ్యం తిన్నాడన్న మాటేగాని చిరంజీవి కాళ్ళు బెండుపుల్లలల్లేనే వున్నాయి. పెద్దగా నడవలేడు. అసలు పరుగెత్తలేడు. మంచంమీద నడుంవాల్చి పుస్తకాలు చదవటమంటేనే చిరంజీవికి బాగుండేది. వాళ్ళమ్మ పంతులుగారింటికెళ్ళి చాలా పుస్తకాలు తెచ్చింది. అందులో కొన్ని బొమ్మల పుస్తకాలు. చిరంజీవి పుస్తకం పట్టుకొంటే అది అయిపోయిందాకా వదలడు. అతనికి ఆటలరంధి బొత్తిగా పోయింది. పుస్తకాలంటే అమ్మా, నాన్నా, అన్నం కవళం అయిపోయినై. శ్రీహరి, సత్యం, వాళ్ళ చెల్లెలు కాముడు – తనను పలకరించి ఆడుకోటం లేదన్న దిగులు అసలు లేదిప్పుడు.

## 2

చిరంజీవిని వాళ్ళ మామయ్య వచ్చి తోడుబెట్టుకు పోయినాడు. ఇక నుంచీ అక్కడే చదువుకోవాలని అమ్మ చెప్పింది.

మామయ్యగారి వూళ్ళో చిరంజీవి నెటిగిన పిల్ల లెవరూ లేరు. మామయ్యగారి పిల్ల లిద్దరూ పారాడే పాప, యింకొక ఆడపిల్ల. తన యీడు

వాళ్ళు గాదు. అక్కడ గూడా చిరంజీవి బడినుంచి రాగానే పుస్తకం ముందే సుకు కూచునేవాడు.

అత్తయ్యవచ్చి - "అదేమిట్రా, ముచ్చుకోనంగాలె. ఎప్పుడూ పుస్తకా లేనా? సాయంత్రంపూట అట్లా దేవుడిగుడికళ్ళే వెళ్ళి ఆడుకోలేవూ?" అన్నది.

చిరంజీవి పుస్తకం కిటికీలో మూసిపెట్టి దేవాలయం వేపు వెళ్ళాడు. అక్కడ పిల్లలు కోలాహలంగా ఆడుతున్నారు. దేవాలయానికి ముందు ప్రహరీగోడతో కలిసి ఐదంతస్థుల గాలిగోపురం గూడా వున్నది. వాళ్ళ వూళ్ళో చివరికి గుడి గోపురంగూడా లేదు.

కొత్తపిల్లవాణ్ణి చూడగానే, వూళ్ళోపిల్లలు చాలామంది అతనివంకే చూశారు. కొందరు చూసి తిరిగి ఆటల్లోకి పోయారు. కాని యిద్దరు ముగ్గురు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా చిరంజీవిముందే నిలబడ్డారు - తన ముఖం మీద కోతులు ఆడుతున్నట్టుగా.

అందులో ఒక లావుపాటి పిల్లవాడు కొంచెం యికిలించి, పళ్ళు బయట బెట్టి-

"ఎవ్వరోవ్ ఈ కొత్తఘటం, రంగాయ్" అని రంగాయ్‌వంక చూశాడు.

"పద్మనాభం గారింటికొచ్చాడ్రా" అని అందులో ఆడపిల్ల మాట అందించింది.

రంగాయ్ వూరుకోలేదు - "అరేయిశివుడూ, యీయన పెద్ద పుస్తకాల పండితుడ్రా. వాళ్ళత్త అమ్మతో అంటున్నది. పుస్తకాలు చదవటం తప్పితే యింకేమీ రాదుట్రా"

లావాటి శివనారాయణకు యీమాటల్తో బాగా నవ్వు వచ్చింది. "వట్టి పప్పుసుద్దన్న మాట" అన్నాడు చిరంజీవి ముఖంలో ముఖంపెట్టి.

ఆడపిల్ల నవ్వింది.

చిరంజీవి ఆ ముగ్గురివంకా తీవ్రంగా చూశాడు. వీళ్ళు పిల్లలు గాదు, తిరుపతి కోతులు. తిరుపతి కోతులుగూడా గాదు, యమకింకరులు. ఒట్టిపుణ్యా నికి తన నేడిపించ జూస్తున్నారు. అతనికి బక్కకోపం వచ్చింది.

"నీకన్నా నయమేలే. నీమాదిరి బండను గాదులే" అని లావుగా బలి సిన శివనారాయణనన్నాడు, కళ్ళల్లో కళ్ళుపెట్టిచూసి.

లావాటి కుర్రవాడు చిరంజీవి చెంప మీద ఛెళ్ళున కొట్టాడు. కొట్టి అక్కడ వుండలేదు. కాలికి బుద్ధిచెప్పి, ప్రహరీగోడ కన్నాల్లో కాళ్ళుదూర్చి,

మెట్లుజేసుకోని, గాలిగోపురం మీదికి రివ్వున ఎక్కాడు, పకపకానవ్వుతూ. వాడితోపాటు రంగాయ్, ఆడపిల్ల గూడా పరుగెత్తిపోయారు.

చిరంజీవి కళ్ళనిండా గ్రరున నీళ్ళు తిరిగినవి. చెంపకుచేయిరాచి చూచుకొన్నాడు. కోపంతో, తనూ ప్రహరీగోడ ఎక్కబోయినాడు. కాని అలుపువచ్చి కిందబడ్డాడు.

* * *

ఇంటికి వెళ్ళింతర్వాత అత్తయ్య అన్నది. "వర్ఠినాప. పుస్తకాలకు తప్పితే మరింకెందుకూ పనికిరాడు. బ్రహ్మజమానం. ఇంత చవటవు. రేపు నువ్వు చదివి చెయ్యబోయే ఘనకార్యం ఏమిటో కాస్తచెప్పుదూ?"

అత్తయ్య తప్పంతా చిరంజీవిమీదనే తేల్చింది. ఆమె కన్న కడుపు గాదు చిరంజీవి.

## 3

చిరంజీవికి జ్వరం వచ్చిందని వాళ్ళ మామయ్య అమ్మకు పుత్తరం రాశాడు. అమ్మవచ్చి చిరంజీవిని తీసుకుపోయింది. వాళ్ళవూరు చేరగానే చిరంజీవికి జ్వరం పోయింది, ఎక్కడకు పోయిందోగాని.

ఆరోజున చిరంజీవి ఆవకాయ వేసుకు తిన్నాడు- అన్నం.

* * *

మావయ్యగారి వూళ్ళో జరిగిన అవమానం చిరంజీవి మరిచిపోలేకపోయినాడు. తలచినకొద్దీ వళ్ళు మండింది. కళ్ళనీళ్ళు వచ్చినవి. చీకట్లో ఏడ్చి చిరంజీవి ఆ సంగతి అమ్మకు చెప్పటానికిగూడా సిగ్గుపడ్డాడు.

ఆరోజునుంచి చిరంజీవికి పుస్తకాల పిచ్చిపోయింది-అంటే బళ్ళోకి పోవటం లేదని గాదు. బళ్ళోపాఠాలు చదవటం వరకే. ఇంటికొస్తే ఆటల ధ్యాసే. తను బ్రహ్మజమానం కాదని నిరుపించుకోవటం ఎట్లామరి?

చిరంజీవిలో వచ్చిన మార్పును చూచి అమ్మ ఆశ్చర్యపడ్డది. కాని ఆమె ఏమీ అనలేదు. తిరిగి శ్రీహరి, సత్యం, కాముడుతో కలిసి-చిరంజీవి ఆడుకోవటం చూసి ఆమె సంతోషించింది.

## 4

ఏడేళ్ళు గడిచినవి, చిరంజీవి పెద్దవాడైవాడు. ఎట్లా! బక్క కోనంగిగా గాదు. దద్దోజనం ముద్దగా గాదు. బ్రహ్మజమానంగా అసలు కాదు. ఉక్కు

కడ్డీగా, నిటారుగా పెద్దవాడైనాడు. తాలింఖానాల్లో పోతబోసిన కొత్త ఉక్కు అతనివళ్ళు. అడవి మానులాగా అతనికి ఛాతీవచ్చింది.

చిరంజీవికి డ్రిల్లుమాష్టరు వుద్యోగం, ఆర్డర్లూ వచ్చినవి.

"అమ్మా, నేను వుద్యోగంలో చేరబోయేముందు మావయ్యగారి వూరు వెళ్ళొస్తా, నాకొ్కంచెం పనుంది" అన్నాడు చిరంజీవి. అనటమేగాదు; ఉన్న పాటున బయలుదేరాడు. తల్లి నవ్వుకొన్నది.

మామయ్య అల్లుడి కండరాలు పట్టిచూచి- "ఏమిరా మిల్టరీవాడా" అని నవ్వుకొన్నాడు. అత్తయ్య కూతురు నివ్వాలని చిరంజీవికి అల్లుడి మర్యాదలు చేసింది. "మామయ్యా, శివనారాయణ అనే అబ్బాయుండాలే మీ వూళ్ళో; వున్నాడా, యింకా?" అని మామయ్యా నడిగాడు, కాళ్ళు కడుకో్్కగానే.

"ఏం వుండకేం? నిక్షేపంవంటి బిడ్డరా. వాడి చదువేమో, సంగతేమో యితర్ల జోలికి పోడు. పెద్ద పరీక్షలకు చదువుతున్నాళ్ళే."

చిరంజీవి, మామవంకి చూసి శివనారాయణ యింటివైపు బయలు దేరాడు. అరుగు మీద కూర్చొన్న శివుణ్ణి, చిరంజీవి సులభంగానే గుర్తుపట్టి నాడు.

"నీతో కొంచెం పనున్నది. దేవాలయం దాకా వస్తావా?" అని ఏకి వచనంలోనే శివుణ్ణి పిలిచాడు.

శివనారాయణ కొంచెం సంభాశించుకొని "క్షమించాలి. మిమ్మల్ని గుర్తు పట్టలేదు" అన్నాడు.

"ఆ సంగతికే; ఆ సంగతికే మాట్లాడాలి" అని చిరంజీవి దారితీశాడు.

దేవాలయంముందు, సాయంత్రం ఎండమాత్రమే వున్నది. చిరంజీవి, శివనారాయణను కిందనిలిపి, పిల్ల సింహంవలె దూకి ప్రహారీ గోడమీదుగా గాలి గోపురానికి లఘించాడు. ఆశ్చర్యంతో శివుడు యిదంతా పరికిస్తూ నిల్చుండిపోయాడు. ఎంత వేగంగా వెళ్ళాడో, అంత వేగంగా చిరంజీవి గోపురం దిగివచ్చి, శివుడిముందు నిటారుగా నిలబడ్డాడు.

"జ్ఞాపకముందా; ఏడేళ్ళకిందట? నేను పద్మనాభం మామగారింట్లో చదువుకోటానికి వచ్చినప్పటి సంగతి, నువ్వు వత్తి పుణ్యానికే నన్ను చెంప దెబ్బకొట్టి పారిపోయిన సంగతి, పాతవిషయంలే"

శివనారాయణ నోరువిప్పి, యీ కొత్త యువకుడివంక చూశాడు.

"మీరేమంటున్నారో నాకు అర్థం కావటంలేదు -" అనబోయాడు.

"ఎందు కర్థమవుతుందీ? అవును. పోరుగూరి పిల్లవాణ్ణి పప్పుసుద్దని ఎగతాళి చెయ్యటం కాదుగా యిది. ఇదిగో విను. నేనొచ్చిన విషయం యిదీ. దెబ్బకు దెబ్బ తీర్చుకుందామని వచ్చాను. నేనిప్పుడు పుస్తకాల పండితుణ్ణి కాదని నీకు రుజువు చేసి వెళ్తా. నీ యిష్టం; నీ కేవిధంగా కుస్తీకి రావాలని ఉన్నదో ఆలోచించుకో."

చిరంజీవి పుద్రేకంగా గబగబా అనేశాడు యీ మాటలు.

శివుడు తగ్గినట్లుగా కనబడలేదు. కాని నెమ్మదిగా చెప్పాడు;

'మీరు చెప్పేది యింకా నేను జ్ఞప్తి తెచ్చుకోలేకుండా వున్నాను. అయినా మీరు పెద్దమనుషులుగా కనడబడుతున్నారు. మీతో కుస్తీపట్లు నా కిష్టం లేదు. కాని మీ క్కావలసింది ఒక్క చెంపదెబ్బేనని నా వుద్దేశ్యం. అట్లా అయితే, యిదిగో నా చెంప. మీ యిష్టం వచ్చినంత బలంగా కొట్టవచ్చు. ఆ తర్వాత యింకా కుస్తీ పట్టాలనివుంటే చూద్దాం." అని ఒక చెంప ముందు కిచ్చి నుంచున్నాడు.

చిరంజీవి ఆ చెంపవంక, ఆ చెంప నిచ్చిన శివునివంకా చూశాడు. మొదట చెయ్యి లేచింది. కాని అప్రయత్నంగానే దిగిపోయింది.

చీకట్లో అతను యింటిముఖంపట్టి:

"మీరూ పెద్దమనుషులుగా మారినట్లుతోస్తున్నది. మిమ్మల్ని కొట్టటం యిక యిష్టంలేదు." అన్నాడు - అని ఫక్కున నవ్వాడు. ఆ నవ్వులో శివ నారాయణ నవ్వు గూడా కలిసింది. ఇద్దరూ చెట్టాపట్టాల్ వేసుకొని పద్మ నాభంగారింటిదాకా వెళ్ళారు.

అక్కడ అత్తయ్య, మామయ్య, మామయ్య పెద్దకూతురు సీతా వరండాలో కూచొని చిరంజీవి ముచ్చటే చెప్పుకొంటున్నారు.

శివనారాయణ ముందు వచ్చి—

"ఏమండీ, మీ చిరంజీవి చాలా గడుసు వాడు లాగా కన్పిస్తున్నాడు. పెళ్ళి ఎప్పుడు చేద్దామంటారో కొంచెం చెప్పండి" అని అడిగాడు.

పద్మనాభం గారు నవ్వుకొని—

"మావాడు చూశావుటోయ్, మిల్టరీ అనుకో. పక్కా మిల్టరీ" అని విరగ బడ్డాడు.

సీత అందుకొని "మిల్టరి ఏమిటినాన్నా! బావ డ్రిల్లుమాష్ట రయితేను" అని తుర్రున లోపలికి పరుగెత్తింది.

"అత్తయ్య నన్ను చదివి చెయ్యమన్న ఘన కార్యం యిదే కాబోలు మామయ్యా" అందరితోనూ కలిశాడు మాజీ బ్రాజమానం, డ్రిల్లు చిరంజీవి - లోపలికి పారిపోయిన సీత వేపు వేలు చూపుతూ.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక : 28-10-53)